పశ్చాత్తాపము

శ్రీమతి వి. శశిలేఖ గారు

౧

కలకత్తాలో ఒకధనవంతుఁ డున్నాడు. అతనికొక కొడుకున్నాఁడు. అతనిపేరు మోహానుఁడు. మోహానునికి, పాపము, చిన్నప్పుడే తల్లి దండ్రులు చనిపోయిరి. అతఁడు, ఏలాగో, బడిలో చదువుకొని, పరీక్షలలో తేలినాఁడు. ఆయూర సుందరరావుగారను ప్లీడరున్నాఁడు. ఆయనకు మనోరమయను ఒకకూతురున్నది. మనోరమకూడ మోహానుఁడు చదువుకొను బడిలోనేచదువుకొన్నది. అప్పటినుండి వారిద్దఱకు చాలస్నేహము. మోహానుఁడు ఎం.ఏ ప్యాసయి ఇంగ్లండు వెళ్ళినాఁడు. మనోరమ బాగుగా ఇంగ్లీషుమాటాడుట వచ్చువఱకు చదువుకొని; తర్వాత మానివేసినది. హిందూదేశమునుండి యింగ్లాండునకు వెళ్లు యువకులలో పెక్కండ్రు ఏలాగున తయారగుచున్నారో వర్ణింపనక్కఱలేదు. మన మోహానుఁడుకూడ అలాగే తయారైనాఁడు. తనదగ్గఱనుండు డబ్బంతయు తగులఁబెట్టినాఁడు.

౨

సుందరరావుగారి కూతుఁరు చూచుటకంత అందగత్తె కాకపోయినను, ముత్తము మీఁద బాగుగనేయున్నది. అందానికి మించినపోషకులు. ఆకులుచచేతులు, నొక్కునొక్కుల వాలుజడ, కండ్లకే జబ్బును లేకపోయినను అందముకోసమై కష్టపడి పెట్టుకొనుచున్న ఒక కండ్లజోడు, ఇంగ్లీషు దొరసానికి వలె కాళ్ళకు టక్కుటిక్కుమను జోళ్లు, ఇంటిలో ఒకముస్తాబు, బయటికి వెళ్ళునప్పుడింకొకముస్తాబు_చేతికి రిష్టువాచి, చెవులకు లోలకులు, పైటకొక బ్రోచి, మొగము మీఁద పడునట్లు జుట్టు, ఆజుట్టునకు క్లిప్పులు, ఇది ఆమె సింగారము. సాయంకాలము నాల్గుగంటలగునప్పటికి కారులోఁగూర్చుండి, టింగురంగాయని ఒయ్యారముగా కాలు మీఁద కాలువేసికొని, యిటునటు మెఱుపుఁజూపులఁచూచుచు, క్లబ్బునకు వెళ్ళును. ఆమెకు రోజంతయు షోకులతోనే ముగియునుకాలము.

3

సుందరరావుగారప్పుడే కోర్టునుండివచ్చి కాఫీ పుచ్చుకొనుచున్నారు. మనోరమ పేపరు చదువుకొనుచు సోఫామీఁద పండుకొన్నది. అప్పుడు తపాలాబంట్రోతువచ్చి సుందరరావుగారి కొక టెలిగ్రామిచ్చినాఁడు. సుందరరావుగారు టెలిగ్రాము మనోరమ చేతికిచ్చి, "మనోరమా! దానిని విప్పి చదువుమమ్మా!" అనెను. మనోరమ యిట్లు చదివెను.

"నేను చాల చిక్కులలో నున్నాను. వెంటనే కొంత 5 వేలు పంపఁగోరెద"

'మోహాన్'

సుందరావుగారి భార్య సుశీల గదిలో తమలపాకులకు సున్నము రాచుచుండెను. సుందరరావుగారు సుశీలను పిలిచినారు. సుశీల రాఁగానే మనోరమ అ[illegible] వెళ్ళిపోయింది.

సుంద—సుశీలా! మోహానుఁడు డబ్బు కొఱకు టెలిగ్రామిచ్చినాఁడు. ఏమిచేయు మందువు?

సుశీల—సందేహమెందుకు? కావలసిన డబ్బు పంపుఁడు.

సుంద—వాఁడు మరల మనకు డబ్బు తీర్చునో లేదో!

సుశీ—ఇయ్యకపోయిన నేమి? మనము పిల్లనిచ్చునప్పుడు కట్నమేమియు ఇయ్య కుండ కార్యము చేయుదము. ఏమందురు?

సుంద—అవును. అలాగుననే చేయు దము.

సుశీ—ఇంక నాలస్యమెందుకు? పాప మతఁ డెంత కష్టపడుచున్నాఁడో!

ఈమాటలన్నియు చాటుననిల్చి మనో రమ విని సంతోషించినది. సుందరరావు మనోరమా యని పిలిచినాఁడు. మనోరమ వచ్చినది.

సుంద—(ఇనుపపెట్టెతాళములు కూఁతు రుచేతికిచ్చుచు) అమ్మాయీ! అయిదువేల రూపాయ లాపెట్టెనుండితీసి మోహానునికి పంపు.

మనో—సరే, నాన్నా—అని సంతోష ముతో వెళ్లింది.

౪

నేఁటిసాయంకాలము లండను నుండి మోహానుఁడు వచ్చును. అందుచేత సుశీల— వంటగదిలో కాఫీ తయారు చేయుచున్నది. "మనోరమా! మోహానుఁడు వచ్చువేళ యైనది. త్వరగా బట్టలువేసికొని మీనాన్న గారితో స్టీమరుదగ్గఱకువెళ్ళు," అని సుశీల చెప్పినది. స్టీమరురేవునకు వచ్చినది. సుందర రావుగారు, ఆయన కొమరితయు కారుదిగి స్టీమరు దగ్గఱకు వెళ్ళునప్పటికి మోహానుఁడు స్టీమరు దిగి వారి కెదురుగా వచ్చెను. వారు మోహానునిచూచి ఆనవాలు పట్టలేకపోయిరి.

మోహా—ఏమండీ, సుందరరావుగారూ! నన్ను మఱచిపోయితిరా యేమి?

సుంద—ఓహో! నీవా? ఇంగ్లాండు వెళ్లినతర్వాత దొరవై పోయినావే! ఆనవాలు పట్టలేకపోయితిని.

మోహా—దానికేమి లెండు. మీరు నాసామానంతయు ఒకబండిమీఁద వేయిం చుకొని తీసికొనివత్తురా? ముందుగా నేనును మనోరమయు మీకారెక్కి వెళ్లెదము. ఏమందువు మనోరమా? వెళ్ళుదమా?

మనో—సరే, మీయిష్టమువచ్చినటులే చేయుదును.

ఇద్దఱును కలిసి వెళ్ళిపోయినారు.

౫

ఒక రోజున పూర్ణిమనాఁడు రాత్రి మనో రమా మోహానులు వెన్నెలలో నది యొద్ద కు షికారువెళ్ళిరి. కారుదిగి నదిగట్టుపై కూర్చున్నారు.

మోహా—మనోరమా! నీముఖమున కును ఆచంద్రునికిని ఏమియు భేదములేదు సుమా! నే నిన్ని దేశాలు తిరిగితిని కాని, నీవంటి చక్కనిదాని నెక్కడను చూడలేదు.

మనో—(నవ్వుచు తలవంచుకొన్నది.)

మోహా—నీమనసులో నా కొంచెము చోటి య్యవా?

మనో—(సిగ్గుచే నూరకున్నది.)

మోహ—ప్రియా! మాటాడవా?

అని బుజముమీఁద చేయివైచి ముఖ ముఖవంక చూచుచు కూరుచుండెను.

మనో—మో...హ...నా! (అని యనురాగదృక్కులతోఁ జూచినది.)

మోహ—ప్రియా! (అని యాలింగనము చేసికొని ముద్దులవాన కురియించినాఁడు) ఆలాగున నెంతసేపుండిరో వారికే తెలియదు. మన మెట్లు చెప్పఁగలము?

మనో—నామనసులో నీకుఁదో టేకాదు. నన్నే నీకర్పించుకొన్నాను.

కొంతసేపైనతర్వాత వారు మరల కారెక్కి వెళ్లిపోయిరి.

౬

రాత్రి పదునొకండు గంటలైనది. మనోరమా మోహనులింకను సినీమానుండి రాలేదు. సుందరరావుగారు మేడమీఁద వసారాలో పడకకుర్చీలో కూరుచుండి యేదో ఆలోచించుచున్నారు. ఇంతలో సుశీలవచ్చి ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నది.

సుశీ—ఏమండీ! మన మనోరమయు మోహనుఁడును ఇంకను రాలేదేమీ? సినీమా తొమ్మిదిగంటలకే అయిపోవునుగదా?

సుంద—ఏమో! వారల వేషములు, చర్యలు, నాకు నచ్చలేదు. రాత్రులయందు ఒంటిగా వెళ్లెదరు షికార్లకు. ఈసినీమాలు, నాటకాలు ఏమో నాకు తెలియకున్నవి. ఎంతగా చెప్పినను వినరు. వారల కర్మము. నేనేమి చేయుదును?

సుశీ—ఆలాగు పనిననెట్లు? వారికి త్వరగా పెండ్లియేల చేయరు?

సుంద—సిద్ధాంతులతో ఆలోచించితిని. రాఁగల ఆదివారము మంచి ముహూర్త మన్నారు.

ఇట్లువారు మాటాడుచుండఁగా, మనోరమా మోహనులు కారుదిగి మేడమీఁదికి వచ్చిరి.

సుంద—మోహన్! మీ పెండ్లికి ఆదివారమునాఁడు ముహూర్తము కుదిరినది. అది స్థిరపఱుపవచ్చునా?

మోహ—ఓ! మీ యిష్టమువచ్చిన నీ రోజున స్థిరపఱుపుఁడు.

(ప్రక్కగదిలో భోజనము సిద్ధము చేయుచున్న సూరమ్మ వెంకయమ్మలను ఇద్దఱు పనికత్తె లిట్లు మాట్లాడుకొనిరి.)

సూర—ఏమే వెంకూ! ఈ రోజులలో సిగ్గులులేవు సుమా? అదేమి పాపమో గాని..........

వెంకమ్మ—పాపమేమే! సిగ్గు ఎందులకే? ఎవరి యిష్టము వారిది. అంతలోనే మనోరమ యిచ్చుటకు వచ్చి యా మాటలాలించి "సూరీ! నీకేమి! మా యిష్టము మాది. నోరు మూయుము" అన్నది.

౭

రాత్రి 8 గంటలకు వివాహముహూర్తము. వచ్చెడు వారికండఱకు మర్యాద చేయుచున్నాఁడు సుందరరావు. పెండ్లిసందడిలో మునిగియున్నది సుశీల. మనోరమ అలంకరించుకొనుచు నిలువుటద్దమునొద్ద నిలిచియున్నది. మోహనుడు సూటువేసికొని

528

పోటకుగా తయారై మనోరమదగ్గఱకు వచ్చినాడు.

మోహ—మనోరమా! ప్రయాణమునకు సిద్ధపడితివా?

మనో—ఎక్కడికి? పెండ్లి పందిటిలోనికే గదా?

మోహ—అవును. కాని, ఆపందిరి యీ దేశములోనిది గాదు.

మనో—మరి యేదేశములోనిది?

మోహ—మన పెండ్లికి తగిన చోటు లండన్. అక్కడికి పోదము రమ్ము.

మనో—అయ్యో! మా నాన్నగారు చాల యత్నములు చేసిరే! వారేమందురో?

మోహ—ఏమన్నను సరియే. బయలుదేఱు. స్టీమరువేళ యగుచున్నది.

మనో—సరే. పదండి.

మోహ—నీ నగలో?

మనో—అవి నా దేహముననేయున్నవి.

మోహ—నా వెనుక నెమ్మదిగా చప్పుడు కాకుండ నడిచిరమ్ము.

మనో—కానిండు. మీదగ్గఱ కావలసిన డబ్బున్నదా?

మోహ—కావలసినదానికన్న నెక్కువ యున్నది. రా.

దొడ్డిదారినిబడి వా రిరువురును పోవుచుండగా, నెవరో చూచి సుందరరావుగారితో చెప్పిరి. సుందరరావు పరుగునబోయి అడ్డుపడినాడు.

సుంద—మోహనా! ఎక్కడికి ప్రయాణము?

మోహ—ఇంగ్లాండునకు.

సుంద—పెండ్లియో?

మోహ—పెండ్లికేమంత తొందర వచ్చెను?

సుంద—అయ్యో! నా పరువులీయకుమా! చుట్టాలందఱు వచ్చిరి. అన్నియు సిద్ధమైనవి. ఇప్పు డిట్లు చేయుదువా?

మోహ—చేయవలసివచ్చినది. మీరు పొండు.

సుంద—మనోరమా! నీ వెందులకు? నీ వుండిపొమ్ము. ఓయి మోహనా! నా కూతును తీసికొని వెళ్లుటకు నీకేమి హక్కున్నది?

మనో—నాన్నా! నేనుగూడ వెళ్లెదను.

సుంద—నామాట వినరా?

మనో, మోహ—మాయిష్టము మాది. మీరు వెళ్లుడు.

సుంద—మీ రెక్కడికి వెళ్లిన నాకేమి? ధర్మము తప్పకుండ పెండ్లి చేసికొని మీ యిచ్చ వచ్చిన చోటికి పొండు. మీ మంచి కోసమే చెప్పుచున్నాను. తరువాత పశ్చాత్తాపపడెదరు సుండీ!

మోహ—(మనోరమ చేయిపట్టుకొని విసుగుదలతో) కాలము మించిపోవుచున్నది అనుచు సమీపముననే వారికొఱకు వేచియున్న కారెక్కి స్టీమరుదగ్గఱకు వెళ్లిపోయిరి.

౨

మనోరమ మోహనము లండను నగరములో స్టీమరు దిగి, ఒక పెద్ద హోటలునకు వెళ్లి, గదులు మాటాడుకొని అందు కాపురమున్నారు. క్రొత్త యూరు కాబట్టి

529

మనోరమకు చాల సరదాగానున్నది. సినీమాలకు, నాటకాలకు, వెళ్లుట తరుచైనది. బసలోనుండుటయే తక్కువైనది.

వారు లండను చేరి దాదాపుగా అయిదు నెలలైనది. ఒకరిమీది మోజు ఒకరికి తగ్గినది. మనోరమకు మనస్సులో కొంచెముబాధగానున్నది. కాని పైకిమాత్రము ఎప్పటివలెనే యున్నది. ఏమేని అనిన, తన్నతఁడు వదలిపోవునేమో యని భయము. ఈలాగుననే రోజులు గడచిపోవుచున్నవి. అతఁ డొక దొరసానితో స్నేహముచేసి, యెప్పు డామెతోనే తిరుగుచున్నాడు. పైగా ఇంటికి తీసికొనివచ్చి మనోరమ యెదుటనే, ఆమెతో హాస్యప్రసంగాలు చేయజొచ్చినాడు. ఒక్కొక్కప్పుడు మనోరమ యెట్ట యెదుటనే దొరసానిని ముద్దు పెట్టుకొనెడివాడు. ఇక మనోరమ యోర్చుకోలేక అడిగివేసిన దొక రోజున మోహనుడు టీ పుచ్చుకొనుచుండ.

మనో—ఏమండీ! నేనుండగా దానితో సరసములా!

మోహ—సరసము లాడినంత మాత్రమున, తప్పా యేమి?

మనో—నేను ధర్మపత్నిని గదా!

మోహ—నీ వెటువంటి ధర్మపత్నివో, ఆమెయు అట్టి ధర్మపత్నియే. నీ గొప్ప యేమున్నది?

మనో—మీ రామెతో తిరుగ వీలు లేదు. నేను గట్టిగా చెప్పుచున్నాను.

మోహ—నీ మాట వినుటకు, నిన్ను నేను పెండ్లి చేసికొంటినా? దానిలాగుననే నీవును వచ్చితివి!

మనో—ఇదా మీ యుద్దేశము? సరే! నేటితో మీకును నాకును సరి.

మోహ—నోరు మూయుము, నీ కర్మము నీది, నా కర్మము నాది. నేటితో నీవు నాకు వదలిపోయితివి.

అనుచు దుస్తులు తొడుగుకొని బయటికి పోయినాడు. మనోరమకు చాల కోపము వచ్చినది. నగలన్నియు తీసివేసినది. మోహనున కొక జాబు వ్రాసి బల్లమీద పెట్టి, కట్టుగుడ్డతోడనే థేమ్సు నదియొడ్డునకు పోయినది. అక్కడ కూర్చుండి మనసులో ఈలాగున అనుకొన్నది. "అయ్యో! దైవమా! నా కెట్టి గతి పెట్టితివి? ఆరోజున మా నాన్న చెప్పినట్లు పెండ్లి చేసికొన్న, ఎంత బాగుగ నుండెడిది! పెండ్లి కాకుండ నతనితో తిరుగరాదని మా యమ్మ యెన్నోసారులు చెప్పినది. ఆ మాటలు విననైతిని. "మీ రొక రోజున పశ్చాత్తాపపడెదరు" అన్నాడు మా నాన్న. అలాగే అయినది. ఆహా! నా జీవితమంతయు వ్యర్థమైపోయినది. ఛీ, ఛీ! నే నిక బ్రతికి యేమి లాభము! హా! తండ్రీ! నా తప్పులు మన్నింపుము. ఇక మొగము చూడను!!" అని నదిలో దూకబోయినది.

౬

మనసేమియు బాగుగానుండక మోహనుడు వెంటనే యింటికి మరలి వచ్చినాడు. "మనోరమ నన్ని మాటలంటిని. ఆమె ముఖ మెట్లుచూచుట?" అనుకున్నాడు. లోపలికి పోయి చూడ మనోరమ కనబడలేదు. "మేడమీదనున్న దేమో, అక్కడకు పోయి క్షమాపణ మడిగెద" నని పైకి వెళ్లి

530

నాడు. ఎక్కడను ఆమె కనుపింపలేదు. ఒక చీటిమాత్రము బల్లమీద దొరకినది. ఆత్రముతో దానిని విప్పి చూచినాడు. గుండెలో పిడుగుపడ్డట్లు అయినది. ఆ చీటిలో ఇట్లున్నది.

"మోహనా! నాకొఱకు నీవు వెదకవలదు. వెదకినను లాభములేదు. దయయుంచి నన్ను మఱచిపొమ్ము.

మనోరమ"

మోహనుడు వెంటనే యిల్లువదలి మనోరమను వెదకుచు బయటికి వెళ్లినాడు. అతనికి బాగుపడెను యోగమున్నది కాబట్టి మనోరమవలెనే పశ్చాత్తాపపడినాడు. కండ్లవెంబడి నీళ్లు కారుచున్నవి. పాపమేమి చేయఁగలడు? త్రోవయు తెన్నును తెలియకయే అతడు నడువ మొదలుపెట్టినాఁడు. దైవయోగముచేత నదియొడ్డునకు చేరుకొన్నాడు. ఎదుట ఒక స్త్రీ చేతులు చాచుకొని నీళ్లలో దుముకబోవుచున్నట్లు, అతడు చూచినాడు. మోహనునికి ఆ వ్యక్తి మనోరమ యని అప్రయత్నముగ తోచినది. ఒక్కపరుగున వెళ్లి మనోరమను పట్టుకొన్నాడు. ఆమె ఆశ్చర్యముతో వెనుకకు చూచినది.

మోహ.—నా తప్పులు క్షమించువఱకు నిన్ను వదలను.

మనో.—మీ తప్పేమున్నది? అంతయు నాదే.

మోహ.—అలాగునకాదు. నా తప్పు క్షమించితిననుము.

మనో.—సరే, వదలుము.

మోహ.—మనమిద్దఱము రేపు కలకత్తా వెళ్లెదము.

మోహనుడు భార్యతో బయలుదేఱి వచ్చుచుండెననియు, పెండ్లికి సర్వమును సిద్ధము చేయవలసినదనియు వెంటనే సుందరరావుగారికి తంతివార్త పంపినాడు.

౧౦

మనోరమా మోహనులు కలకత్తా చేరిరి. కొలది దినములకే వివాహమైనది. దంపతులానందముతో వృద్ధ దంపతులగు సుశీలా సుందరరావుగార్లకు నమస్కరించిరి. వారు మనఃపూర్వకముగా వధూవరుల నాశీర్వదించిరి. అంతయు ఆనందమయమై పోయెను.

నేటి "బి. యే." లు

శ్రీమతి చర్లసగి రాజకుమారిగారు

సీ॥ ఉద్యోగము దొరక దోదేముడాయని దేవులాడుచు నూళ్లుదిరుగువారు
పిత్రార్జితంబంత పీసమైనను లేక బి. యె. కయ్యెనని విలపించువారు
చదువులకై కలసంపదల్ గోల్పోయి సతులసొమ్ముకు చేయిజాపువారు
ఉద్యోగమునకునై యూరూరదిరుగుచు కలధనంబుల ఖర్చుసలుపువారు
నగుచునెందును జీవనోపాధిలేక
కుందుచున్నారు సుఖములకోలుపోయి;
"కాలమా! నీకృతమ్ములు గలవుగద క
తమ్ములున్ గోట్లు, ఏమిఫలమ్ము బలుక!"